
సాక్షి
గుంటూరు
శుక్రవారం ৷ 5 ৷ ఏప్రిల్ ৷ 2024



ఆవులయ్య స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని నాయుడుపాలెంలో ఆవులయ్య స్వామి తిరునాళ్ల గురువారం నిర్వహించారు. భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం గురువారం 512.10 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 6,325, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
గుంటూరు	6.26	4.43
బాపట్ల	6.26	4.43
నరసరావుపేట	6.28	4.45

న్యూస్‌రీల్

రుక్మిణీ కల్యాణం అలంకారంలో శ్రీవారు



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి రుక్మిణీ కల్యాణం అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మాజీ ఎమ్మెల్యే జీవీకి నోటీసులు

వినుకొండ: మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ నాయకుడు జి.వి.ఆంజనేయులుకు ఎన్నికల అధికారులు గురువారం షోకాజ్ నోటీసులు అందజేశారు. ఇటీవల ఈపూరు మండలం కొండ్రముట్లలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ రిటర్నింగ్ అధికారి ఆంజనేయులపై గురువారం నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దీనిపై జీవీ ఆంజనేయులు 24 గంటల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు



అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలో కొలువైన గంగా, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల శిఖర గోపుర ప్రతిష్ట మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శాంతి హోమాలు, యాగాలు, చండీపారాయణ నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోకేశ్ వస్తేనే జనాన్ని తెస్తారా..నేను వస్తే రారా!!

నాయకులపై పెమ్మసాని ఆగ్రహం

మంగళగిరి: 'లోకేశ్ వస్తేనే జనాన్ని తరలిస్తారా .. నేను వస్తే కార్యకర్తలు కూడా రారా' అంటూ గుంటూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మంగళగిరి పట్టణంలో ప్రచారం చేశారు. అయితే, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు ప్రచారంలో పాల్గొనలేదు. జనం లేకపోవడం, కార్యకర్తలు కూడా హాజరుకాకపోవడంతో పెమ్మసాని అసహనానికి లోనై నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నానని, ఇప్పటికే పార్టీ ఫండ్ వందల కోట్లు ఇచ్చానని వాపోయారు. లోకేశ్ సొమ్ము ఏమీ పెట్టడం లేదని బహిరంగంగా వ్యాఖ్యానించడంతో నాయకులు, కార్యకర్తలు విస్తుపోయారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రచారానికి జనాన్ని ఎందుకు తీసుకురావడం లేదని పెమ్మసాని ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాయకులు, కార్యకర్తలు కూడా అసహనానికి గురయ్యారు. డబ్బులు ఇచ్చిన వారిని అడగాలి.. పార్టీ మీద అభిమానంతో రూపాయి తీసుకోకుండా ప్రచారానికి వస్తున్న కార్యకర్తలను అంటారా ? అంటూ అక్కడ నుంచి వెళ్లిపోవడంతో చేసేదేమి లేక కొద్దిసేపు పర్యటించి పెమ్మసాని వెనుతిరిగారు.

వైభవంగా శిలాబింబి ప్రతిష్ట మహోత్సవం



హుస్సేన్ నగరం(పెదకూరపాడు): పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో కొలువై ఉన్న రేణుకా అంకమ్మతల్లి, పోతురాజు శిలాబింబి ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీకు పుణ్యం...మాకు సేవా ఫలం

- మిగిలిన ఆహారాన్ని అందిస్తూ..కాలే కడుపులకు పట్టెడన్నం పెడుతున్నారు
- నాలుగేళ్ల సేవా ప్రస్థానంలో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్
- ఆహారాన్ని పారేయొద్దు..మాకందించండి.. మీ పేరుతోనే పంచిపెడతామంటున్న ట్రస్ట్ సభ్యులు



గుంటూరు జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు ఉచిత భోజనం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్

గుంటూరు మెడికల్ : అన్నం పర బ్రహ్మ స్వరూపం . అలాంటి ఆహారాన్ని శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల వేళల్లో వృథాగా పడేస్తుంటారు. అలా కాకుండా మానవతా దృక్పథంతో ఆలోచిస్తే కాలే కడుపుల క్షుద్బాధను తీర్చగలమంటున్నారు వాళ్లు. ఆకలితో అలమటించేవారికి పట్టెడన్నం పెట్టే మార్గం కోసం అన్వేషించారు. ఆ ఆలోచనలోంచి పుట్టుకొచ్చిందే మిగిలిపోయిన ఆహార సేకరణ. 'పదార్థాలను వృథాగా పార బోయకుండా మాకు అందిస్తే మీ పేరుతో మేమే పేదలకు భోజనం పెడతాం. వారి ఆకలి తీరుస్తాం.మీకు పుణ్యం ..మాకు సేవా ఫలం' అంటూ నాలుగేళ్లుగా తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. వారే గుంటూరు నగరానికి చెందిన 'గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్' ప్రతినిధులు. అన్నార్తుల సేవలో తరిస్తోన్న ట్రస్ట్ ప్రస్తానంపై ప్రత్యేక కథనం.

మహమ్మారి వేళ మొగ్గతొడిగి..

గుంటూరు జీజీహెచ్ డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ ఎదురుగా ప్రధాన గేటు వద్ద వైఎస్సార్ ఫుడ్ కోర్టును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉచితంగా అన్నదానం చేస్తూ ఉండటంతో కార్పొరేషన్ అధికారులు ఫుడ్ కోర్టును కూడా వారికి అప్పగించారు. ఇక్కడ ప్రతిరోజూ మధ్యాహ్నం 300 మందికి పైగా ఉచితంగా భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్నారు. మహమ్మారి సమయంలోనూ కోవిడ్ పాజిటివ్ బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి ఉచితంగా భోజనం అందించి ఈ ట్రస్ట్ సభ్యులు పలువురి మన్ననలు పొందారు.

సేవా నిరతి..ప్రశంసల హారతి

మహమ్మారి విజృంభించే తొలి రోజుల్లో కోవిడ్‌సోకి మరణిస్తే వారి భౌతిక కాయాల్ని పట్టుకునేందుకు కుటుంబ సభ్యులు సైతం భయపడిపోయే వారు. మరణించిన వారిని ఆస్పత్రుల్లోనే వదిలేసేవారు. అందరూ ఉండి అనాథలుగా శవాగారాల్లో ఉన్న భౌతికకాయాల్ని చూసి చలించిన నగరానికి చెందిన కొందరు యువకులు 2020లో గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యికి పైగా భౌతిక కాయాలకు వారి సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. సొంతంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి రోగుల్ని వారికి నచ్చిన ఆస్పత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించేవారు. ఇప్పుడు కూడా ఈ సేవలను కొనసాగిస్తున్నారు.

ముందస్తు ప్రణాళికతో ..

రోజూ జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో శుభ కార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటి డేటాను ముందురోజు సేకరిస్తారు. ఆయా నిర్వాహకులను సంప్రదిస్తారు. మిగులు పదార్థాలను పార బోయకుండా సమాచారమిస్తే వచ్చి సేకరిస్తామని చెబుతారు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదించి శుచి, శుభ్రతగా ఉండే ఆహార పదార్థాలను సేకరిస్తారు. వాటిని ఫుడ్ కోర్టుకు తరలించి మరోసారి తనిఖీ చేసి అన్నార్తుల కడుపు నింపే కార్యక్రమంలో తలమునకలవుతారు. ఇలా నాలుగేళ్లగా సేవలను సాగిస్తూ, ప్రతిరోజూ 300 మంది ఆకలిని తీరుస్తున్నారు.

ట్రస్ట్ సేవలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లివే..

8143222456, 9397602553, 7396722171



భోజనాన్ని వడ్డిస్తున్న ట్రస్టు సభ్యుడు

ఆకలి తీరుస్తూ..ఆదర్శంగా నిలుస్తూ..

మహమ్మారి విజృంభించిన రోజుల్లో లాక్ డౌన్ కారణంగా రోజువారీ పనుల్లేక పస్తులతో అలమటించిన వారి దైన్యాన్ని చూసిన ట్రస్టు సభ్యులు వారి కోసం ఏదో చేయాలని సంకల్పించారు. పలు ప్రాంతాల నుంచి చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన రోగుల సహాయకులకు బయట ఎక్కడా భోజనం లభించని దుస్థితి చూసారు. తమ వేతనాల్లో నుంచి కొంత చందా వేసి ఉచితంగా భోజనం అందించడం ప్రారంభించారు. అయితే అన్నార్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో సేవల విస్తృతిని పెంచేందుకు ముందుకొచ్చారు. ఆహార సేకరణపై దృష్టి సారించారు. ఇందులోంచి పుట్టుకొచ్చిందే మిగులు పదార్థాల సేకరణ.

25మంది బృందంగా ..

ట్రస్ట్‌లో 25 మంది సభ్యులు ఉన్నారు. కాగా వీరిలో ఏడుగురు ఇంటర్ చదువుతున్న విద్యార్థులుండటం విశేషం. చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ తమకు వస్తున్న ఆదాయంలో కొంత వెచ్చిస్తున్నారు. ఇక విద్యార్థులైతే తమ పాకెట్ మనీలో కొంత కేటాయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇప్పటి వరకు తొమ్మిది లక్షల మందికి..



ట్రస్టు ఆధ్వర్యంలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరిస్తున్నాం. ఇలా నాలుగేళ్లలో తొమ్మిది లక్షల మంది ఆకలిని తీర్చాం. శుభకార్యాలు నగరంలో ఎక్కడైనా జరిగితే వివరాలు సేకరిస్తాం. ముందస్తుగా సమాచారమందిస్తాం. వారు ఫోన్ చేస్తే వెళ్లి సేకరిస్తాం. ఎవరైతే భోజనం అందిస్తారో వారి పేరున బోర్డు ఏర్పాటు చేసి దాతగా ప్రకటిస్తాం. ఉచితంగా అంబులెన్స్ సేవలనూ అందిస్తున్నాం.

–పఠాన్ అల్లాబక్షు, గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు

రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ట త్రిపాఠి



సర్వశ్రేష్ట త్రిపాఠీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ట త్రిపాఠి నియమితులయ్యారు. ఆయన గుంటూరులోని రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఐజీగా విధులు నిర్వర్తించిన జి.పాలరాజు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ట త్రిపాఠిని అధికారులు నియమించారు. 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన 2016–18లో గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పల్నాడు ఎస్పీగా బిందుమాధవ్



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు గతంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా, ఎస్ఈబీ ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది. గతేడాది ఏప్రిల్ 8న గ్రేహౌండ్స్ ఎస్పీగా పదోన్నతి పొంది పల్నాడు నుంచి వెళ్లారు. తిరిగి జిల్లాకు ఎస్పీగా వచ్చారు. పల్నాడు జిల్లా తొలి ఎస్పీగా పనిచేసిన వై. రవిశంకర్‌రెడ్డి మంగళవారం బదిలీ అయిన సంగతి తెలిసిందే.

వైఎస్సార్ సీపీకి ముస్లింలే పట్టుగొమ్మలు

- మంత్రి విడదల రజిని
- సొంత మనుష్యుల్లా భావించే సీఎం జగన్ : రోశయ్య



మాట్లాడుతున్న మంత్రి రజని. వేదికపై గుంటూరు లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్యే రోశయ్య తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముస్లింలు పట్టుగొమ్మలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శ్రీనివాసరావుపేటలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు జానీ బాషా, కార్పొరేటర్ గేదెల నాగరంగమణి, గేదెల రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి రజిని, పార్టీ పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య హాజరయ్యారు. ముందుగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీని అంటిపెట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకంతో ముస్లింలు ఎంతో అండగా నిలబడ్డారని తెలిపారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి రిజర్వేషన్ కల్పించి వారిని అన్ని విధాలా ఆదుకున్నారని చెప్పారు. మహానేత ఆశయాల వారసుడిగా, సీఎం జగనన్న ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని కొనియాడారు. చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తిగా అన్యాయం జరిగిందని, మంత్రివర్గంలో ముస్లిం లేని వ్యవస్థను కొనసాగించిన వ్యక్తి అని మండి పడ్డారు. రానున్న ఎన్నికల్లో సైతం ముస్లింలు కీలకపాత్ర పోషించనున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీకి పునాది

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను సొంత మనుషుల్లా భావించే గొప్ప మనస్తత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య చెప్పారు. ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హతే ప్రమాణికంగా వారి గడప వద్దకు చేర్చారన్నారు. కేబినెట్ మంత్రి హోదా నుంచి చిన్న స్థాయి పదవుల వరకు ముస్లింలకు గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని తెలిపారు. జెండాను భుజాన పెట్టుకుని, ఇది తమ పార్టీ అని, పార్టీ ఏర్పడిన నాటి నుంచి ముందుకు సాగిన ముస్లింలు వైఎస్సార్ సీపీకి పునాది వంటి వారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మంత్రి రజినమ్మను అఖండ మెజార్టీతో గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌ను చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

లాలుపురం అమ్మాయి..బెల్జియం అబ్బాయి

- హిందూ సాంప్రదాయంలో కళ్యాణం
- తెలుగువారి వస్త్రాలంకరణతో సందడి చేసిన బెల్జియన్లు



కళ్యాణ మండపంలో ఒక్కటైన పుష్పలత, క్రిస్

గుంటూరు రూరల్: నగర శివారు గ్రామమైన లాలుపురానికి చెందిన ఆములోతు నరసింహారావు, కనకలక్ష్మి దంపతుల కుమార్తె పుష్పలత హైదరాబాద్ టీసీఎస్ లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఓ ప్రాజెక్టు వర్క్ పనిపై బెల్జియం వెళ్ళింది. అక్కడ అదే ప్రాజెక్టులో పనిచేస్తున్న వెస్ట్ ప్లాండర్స్ ప్రాంతానికి చెందిన క్రిస్ పోలేంటితో పరిచయం ఏర్పడింది. అది విడదీయరాని బంధంగా, పరిణయంగా మారింది. మనసులు కలిసిన ఇద్దరి నిర్ణయానికి ఇరుపక్షాల తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో వారిద్దరి వైవాహిక జీవితానికి మార్గం సుగమం అయ్యింది. ముఖ్యంగా హిందూ సంస్కృతి, సాంప్రదాయాలపై మక్కువ చూపిన క్రిష్ కుటుంబం లాలుపురంలోని వధువు కుటుంబ సభ్యుల మధ్య వివాహం జరపాలని నిశ్చయించుకున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ఓ కళ్యాణ మండపం గురువారం వేదికయింది. అందరిసాక్షిగా ఆ జంట ఒక్కటైంది. వరుడి బంధువులు తెలుగింటి సాంప్రదాయ వస్త్రాలు ధరించిన తీరు వివాహ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక గ్రామస్తులు పెళ్లి వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

జగ్జీవన్ రామ్ ఆలోచనలు ఆచరణలోకి తేవాలి



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై డాక్టర్ డి.ఆర్.సతీష్‌బాబు

- నాగార్జున యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్
- విశ్వవిద్యాలయంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతి

ఏఎన్‌యూ: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ ఆలోచనలు ఆచరణలోకి తీసుకెళ్లాలని నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలు బాబు జగ్జీవన్‌రామ్ చైర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు చైర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.మధుబాబు అధ్యక్షత వహించారు. వైస్ చాన్స్‌లర్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయనలోని రాజకీయ చైతన్యాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ ప్రజల ఆకాంక్షలు, సంతోషాలతో పాటు వారి భవిష్యత్ కోసం పార్లమెంటులో ఆచరణకు కృషి చేశారని అన్నారు. సుదీర్ఘ పార్లమెంట్ సభ్యుడిగా జగ్జీవన్ రామ్ సాధించిన రికార్డును ఎవరూ అందుకోలేరన్నారు. జగ్జీవన్ రామ్‌పై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేయాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగి వేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఆర్.సతీష్‌బాబు మాట్లాడుతూ ఆలోచనపరంగా, ఆచరణపరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా జగ్జీవన్‌రామ్ గొప్పతనాన్ని గుర్తెరగాలన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న జగ్జీవన్ రామ్ చైర్ దేశ నలుమూలల నుంచి పరిశోధకులు వచ్చేలా పరిశోధనలు, పుస్తకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చైర్ కోఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న చెర్ ద్వారా జగ్జీవన్ రామ్ ఆలోచన దృక్పథాన్ని సమాజానికి అందజేసే పరిశోధనలు, కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ముందుగా వర్సిటీలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో ప్రిన్సిపాల్స్ కె. గంగాధరరావు, సీహెచ్. స్వరూపరాణి, పి.జాన్సన్, పి. సిద్ధయ్య, ఈ. శ్రీనివాసరెడ్డి, అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగరాజు, జి. చెన్నారెడ్డి, కోఆర్డినేటర్లు జి.అనిత, వై.అశోక్ కుమార్, కే.సోమశేఖర్, ఎం. త్రిమూర్తి రావు, కె. వి. శాంతి శ్రీ, ఉదయ కుమార్, డి.రవి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటుతో ప్రయోజనం




ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ (ఈఎల్‌సీ) ఆధ్వర్యంలో నూతనంగా ఓటు హక్కు పొందిన విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాస రెడ్డి, పెదకాకాని తహసీల్దార్ , మండల అసిస్టెంట్ రిటర్నింగ్ పి. రత్నం, పెదకాకాని ఎంఈఓ శంకర రాజు, కళాశాల బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సదస్సులో ఓటు గొప్పతనం, ఓటు హక్కు వినియోగించుకోవలసిన ఆవశ్యకతను, దాని ప్రయోజనాలను, నూతన ఓటు హక్కు దారులకు వివరించారు. 2024 పార్ల మెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో నూతన ఓటర్లు అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

–ఏఎన్‌యూ

యార్డులో 1,15,532 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,10,019 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,532 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,090 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.





క్లుప్తంగా

'గడప గడపకు' కథాసంపుటి ఆవిష్కరణ రేపు


వల్లూరు శివప్రసాద్

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ నాటక, కథా రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ రచించిన హాస్య, వ్యంగ్య కథా సంపుటి 'గడప గడపకు' ఈ నెల ఆరో తేదీన ఆవిష్కరించనున్నారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ అయిదో లైనులో గల గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ ఆర్గనైజేషన్‌లో సాయంత్రం 6.15 గంటలకు ఏర్పాటయ్యే ప్రత్యేక సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహిస్తారు. కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ టాక్స్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ బి.రవీంద్రనాథ్ ఈ కథాసంపుటిని ఆవిష్కరిస్తారు. ప్రముఖ సాహితీ విమర్శకురాలు డాక్టర్ సీహెచ్ సుశీల పుస్తక పరిచయం చేస్తారు.

జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో చదువుకు దూరమైన, బడిఈడు పిల్లలను గుర్తించాలని సమగ్రశిక్ష గుంటూరు జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు కలిగి, బడి మధ్యలో మానేసిన విద్యార్థులతో పాటు ఐదేళ్లకు పైబడి బడిఈడు కలిగిన బాలల వివరాలపై ఈ నెల 10వ తేదీలోపు క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేయాలని సీఆర్పీలకు తెలిపారు. మండలాల వారీగా ఎంఈవోలు ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి, సీఆర్పీలతో పకడ్బందీగా సర్వే నిర్వహించి, వివరాలను గూగుల్ ఫాంలో పూర్తిచేయించాలని, ఇదే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక రోగి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకమ్మరావునగర్‌కు చెందిన ఎ.రాజు (32) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న సిగరెట్ కాల్చేక్రమంలో అగ్గిపుల్ల జేబులో వేసుకున్నాడు. మంటలు వ్యాపించి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాండవుల ధర్మం ముందు.. కౌరవుల బలం ఎంత

- సంక్షేమ సారథి జగనన్న ముందు కూటముల కుట్రలు నిలబడలేవు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన గుంటూరు కేవీపీ కాలనీ టీడీపీ శ్రేణులతో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: పాండవుల ధర్మం ముందు.. కౌరవుల బలం ఎంత ఉన్నా నిలబడలేకపోయిందని, సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ఢీ కొట్టేందుకు.. ఎన్ని కుట్రలు పన్నినా.. కూటములు కట్టినా.. ఓటమి తప్పదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 21వ డివిజన్ కార్పొరేటర్ కాంద్రుగుంట గురవయ్య ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో టీడీపీ, జనసేనకు చెందిన దివ్యాంగుల కాలనీ, కృష్ణబాబు కాలనీ వాసులు 200 మంది వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పరిపాలన ముందుకు సాగిందన్నారు. జగన్నాథ రథ చక్రాలు కదిలాయని, త్వరలోనే గుంటూరుకు సీఎం జగనన్న రానున్నారని తెలిపారు. చంద్రబాబుకు పేదలంటే చిన్న చూపని, పేదలకు పెద్ద పీట వేసిన చరిత్ర సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఖచ్చితంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తామని స్పష్టం చేశారు. పేద వర్గాలను అన్ని విధాలుగా మోసం చేసిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

పేదలకు,పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం

త్వరలో జరుగనున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే పోరాటమని మంత్రి రజిని స్పష్టం చేశారు. పేదల పక్షాన సీఎం జగనన్న పోరుకు సన్నద్ధమవుతుంటే, పెత్తందారుల పక్షాన కూటమిగా ఏర్పడి ధనవంతులంతా మూకుమ్మడిగా వస్తున్నారని విమర్శించారు. టీడీపీని నమ్ముకుని దశాబ్దాలుగా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆ పార్టీ మొండి చెయ్యి చూపిందని మండిపడ్డారు. పార్టీ జెండాను భుజాన ఎత్తుకుని నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. తమ ఇంటి ఆడబిడ్డగా పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

మా నమ్మకం మీరేనమ్మా...

'ఎన్నో ఏళ్లుగా టీడీపీ, జనసేన పార్టీల్లో పనిచేస్తున్నా.. మాకు ఎలాంటి గుర్తింపు దక్కలేదు. పేదలకు మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నాం. మీపై మాకు ఎంతో నమ్మకం ఉంది రజినమ్మా.' అని పార్టీలో చేరిన వారు ముక్తకంఠంతో నినదించారు. పార్టీలో చేరిన వారిలో బాజీ, సుధాకర్, మౌలాలి, షేక్‌బడే, ఏసు, ఆనందరావు, రమణ, జబ్బార్, సాయిబాబు, హుస్సేన్, పోలేరమ్మ, రజిని, కొండలు, మోషె, రాజు, వెంకటమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

అద్భుత సృజన

- తేలికపాటి వాహనాన్ని రూపకల్పన చేసిన విద్యార్థులు
- పాఠశాల స్థాయిలో అద్భుత ఆవిష్కరణ
- రూ.లక్షన్నర ఆర్థిక సాయమందించిన పాఠశాల యాజమాన్యం
- లీటర్ పెట్రోలుతో 30 కిలోమీటర్ల మైలేజ్
- నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జైరామ్, సుభాష్ ప్రతిభ
- పలువురి ప్రశంసలు


గోకార్ట్ వాహనాన్ని నడుపుతున్న జైరామ్, సుభాష్

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్ కళాశాలల్లో చేసే సాంకేతిక ఆవిష్కరణలను తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే చేసి చూపించారు. ప్రతిభాపాటవాలతో పదిమందికి పనికొచ్చే ఆవిష్కరణకు బీజం పోశారు గుంటూరు అమరావతిరోడ్డులోని నెక్స్ట్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన జైరామ్, సుభాష్. పాఠ్య పుస్తకాల్లోని జ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. సమాజానికి ఉపయోగపడేలా నవ్య ఆవిష్కరణను రూపొందించడంలో సఫలీకృతులయ్యారు. వారి మేధస్సులోంచి పుట్టిందే తేలికపాటి వాహనం.

గో కార్ట్‌కు ప్రాణం

మెకానికల్ ఇంజినీరింగ్ పట్టభద్రుల మేధస్సుకు సమంగా తక్కువ ఖర్చుతో ఓ వాహనాన్ని తయారు చేసేందుకు జైరామ్, సుభాష్ ఉద్యుక్తులయ్యారు. బహుళ ప్రయోజనకారిగా ఉపకరించాలని నిర్ణయించుకున్నారు. అటు వాణిజ్యపరంగానూ, ఇటు ప్రజాజీవనానికి అనువుగా ఉండేలా తేలికపాటి వాహనానికి ప్రాణం పోశారు. పెట్రోల్‌తో నడిచే జీఎక్స్–390 ఇంజన్‌ను అమర్చారు. లీటర్‌కు 30 కిలోమీటర్ల మైలేజీ వచ్చేలా రూపొందించారు. దీనికి ''గోకార్ట్'' అని నామకరణం చేశారు. వీరి పట్టుదల, ఏకాగ్రతను గుర్తించిన పాఠశాల యాజమాన్యం తమ వంతుగా రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఇద్దరు కూర్చుని ప్రయాణించడంతో పాటు సరుకులను రవాణా చేసేందుకు వీలుగా ఈ తేలికపాటి వాహనాన్ని డిజైన్ చేశారు. గోకార్ట్ తయారీకి అవసరమైన సామగ్రిని విద్యార్థులే స్వయంగా సమకూర్చుకున్నారు. టైర్లు, స్టీల్ రాడ్లు, బేస్‌మెంట్ ఇతర మెటీరియల్ ను తెప్పించి వాహనానికి ఊపిరిపోశారు.

ప్రయోగం.. విజయవంతం

తాము రూపొందించిన గోకార్ట్ వాహనాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. వాహనంలో జైరాం, సుభాష్ కూర్చొని, డ్రైవింగ్ చేస్తూ మైదానం చుట్టూ తిరిగి చక్కర్లు కొట్టారు. ఇరుకైన వీధుల్లోనూ సంచరించేలా ఈ వాహనాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఆవిష్కర్తలు చెబుతున్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కోగంటి శ్రీకాంత్‌బాబు, డాక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ సుధీర్, సీఓఓ శ్రీకాంత్ అభినందించారు.

రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- ఫిరంగిపురంలో ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం


తూర్పు బజార్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: రాజన్న రాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మండలకేంద్రంలోని 3,4,5 వార్డులలో గురువారం సాయంత్రం ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలను పలకరించారు. వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు మంచి జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని చెప్పారు. దళారులతో పనిలేకుండా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాయంటే అది జగనన్న కృషి అని తెలిపారు. తొలుత సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ మందిరంలో పూజలు నిర్వహించారు. తూర్పుబజార్‌లోని బాల ఏసు మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిరహించారు. అనంతరం పోలేరమ్మ గుడివద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు డి. కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నపరెడ్డి, మేడాబాబు, లక్ష్మయ్య, చిట్టా, అంజిరెడ్డి, నన్నం సునీత, బి.అంజిరెడ్డి, వై.యల్లారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, పి.రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, డి.నరేంద్ర, పి.చిన్న, హేమలతారెడ్డి, చిన్నయ్య, టి.కృష్ణ, ఖాజావలి, సుభాని పాల్గొన్నారు.

'మణిపాల్'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణం మహానాడులో ఉన్న మణిపాల్ హాస్పిటల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో గురువారం డాక్టర్ కంటిపూడి సుధాకర్ విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, వయోవృద్ధుల్లో న్యూమోకాకల్, ఇన్‌ఫ్లూయెంజ వంటి శ్వాసకోస ఇన్ఫెక్షన్ల నివారణకు ముందస్తుగా టీకాలు వేయడం, వారి క్రమబద్ధమైన ఆరోగ్య పరిరక్షణకు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఫైజర్‌తో భాగస్వామ్య కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్‌లో వయోవృద్ధులకు వ్యాక్సినేషన్ కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోగి ఆరోగ్య సంరక్షణ, టీకాలపై అవగాహన, నివారించగల వ్యాధుల కోసం హాస్పిటల్‌లో సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ డాక్టర్ లోకేష్ గుత్తాతో జరిగిన ప్యానెల్ చర్చలో నిపుణుల సూచనలతో పాటు, చర్చకు నాయకత్వం వహించిన ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ మనోజ్‌కుమార్, సీనియర్ డాక్టర్లతో సైంటిఫిక్ సమ్మిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ఎన్.మురళీకృష్ణ, మెడికల్ ఆంకాలజీలో డాక్టర్ కృష్ణారెడ్డి, నెఫ్రాలజీ డాక్టర్ వీఎస్ఎస్ఎన్ శ్రీధర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ యు.హారిక సమష్టి దృష్టిసారించారన్నారు. రిస్క్ గ్రూపులకు ప్రాధాన్యం ఇవ్వడంపై చర్చించామన్నారు.

పారదర్శకంగా పోలింగ్ విధులు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: పోలింగ్ విధులను నిబద్ధతతో అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి ఆయన ఎన్నికల విధులకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఎన్ఐసీ పోర్టల్ ద్వారా నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల పరిధిలో 1915 పోలింగ్ కేంద్రాల్లో ఏఓ, ఏపీఓలుగా రిజర్వు సిబ్బందితోపాటు, మొత్తం 4,600 మంది ఉద్యోగులను నియమించామని తెలిపారు. వీరికి ఈ నెల 15, 16 తేదీల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. శిక్షణ సమయంలో పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్దిరోజా, మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఎన్ఐసీ డీఐఓ విమల్‌కుమార్ పాల్గొన్నారు.

రెండిళ్లలో వరుస దొంగతనాలు

రెండు కిలోల వెండి, 11 గ్రాముల బంగారం చోరీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండు కిలోల వెండి, 11 గ్రాముల బంగారంతో పాటు రూ 5 వేలు నగదు అపహరణకు గురయ్యాయి. ఏఎస్సైలు సైదా, మహబూబ్ బాషాల వివరాల మేరకు.. స్థానిక విద్యానగర్ రెండో లైనులో ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో దాచిన రెండు కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. ఇదే వీధిలో గనిపిశెట్టి భాస్కరరావుకు చెందిన ఇంట్లో బీరువా పగులగొట్టి అందులో ఉన్న 11 గ్రాముల పలు ఆభరణాలతో పాటు రూ.5 వేల నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది రెండిళ్లలో వేలిముద్రలు సేకరించినట్లు ఏఎస్సై తెలిపారు.

తెనాలి శిల్పకారుల కళా సృజన


అహ్మదాబాద్‌కు అధిష్టించిన అంబేడ్కర్ విగ్రహాలు


విగ్రహాలతో శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తెనాలి: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నగరంలో ప్రతిష్ట నిమిత్తం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాలను రూపొందించినట్లు ప్రముఖ శిల్పకారులు, తండ్రీకొడుకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తెలిపారు. గురువారం వీరు తయారుచేసిన విగ్రహాలను అహ్మదాబాద్ తరలిస్తున్న సందర్భంగా స్థానిక విలేకరులకు వివరాలను తెలియజేశారు. పెడస్టల్, విగ్రహం కలిపి మొత్తం 10.5 అడుగుల ఎత్తులో ఫైబర్ గ్లాస్‌తో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలను తయారు చేశామన్నారు. పార్లమెంటును పోలిన పెడస్టల్ డిజైన్‌లో అంబేడ్కర్ కుర్చీలో కూర్చొని రాజ్యాంగాన్ని రచిస్తున్నట్లు తాము తొలిసారిగా విగ్రహాన్ని తీర్చిదిద్దామన్నారు. ఈ విగ్రహానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. తొలిసారిగా గుజరాత్ రాష్ట్రానికి రెండు విగ్రహాలను పంపుతున్నామని చెప్పారు. భారత ఆర్థిక రాజధాని ముంబయికి కూడా ఇదే తరహాలో కాంస్య విగ్రహం తయారుచేస్తున్నామని వివరించారు. భారత దేశం నలుమూలల నుంచి అంబేడ్కర్ విగ్రహానికి ఆర్డర్లు రావటం సంతోషంగా ఉందన్నారు.

రేపటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

న్యూ అసోసియేషన్ అధ్యక్షురాలు రేవతి


బాస్కెట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

గుంటూరు రూరల్: బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూర్ డిస్ట్రిక్ బాస్కెట్ బాల్ అధ్యక్షురాలు మారెళ్ళ రేవతి గురువారం తెలిపారు. అంకిరెడ్డిపాలెంలోని బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని బాలబాలికలకు వేర్వేరుగా శిక్షణ శిబిరం శనివారం నుంచి మే నెలాఖరు వరకు నిర్వహిస్తామని తెలిపారు. అంకిరెడ్డిపాలెంలోని సింథటిక్ కోర్టులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాల్గొనదలచిన వారు ఈ నెల 6వ తేదీ లోపు తమ పేర్లు అంకిరెడ్డిపాలెంలోని బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద లేదా నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని చెప్పారు. పి.సుకన్య, వెంకటకష్ణ శిక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

7 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

- కొండవీటి, పుచ్చలపల్లి సుందరయ్య కళా పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ
- 7, 8 తేదీల్లో లింగారావుపాలెంలో..
- 9, 10 తేదీల్లో యడ్లపాడులో..

యడ్లపాడు: కొండవీటి కళా పరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా రెండు కళాపరిషత్‌లు కలిసి నాటికల పోటీలు నిర్వహించడం విశేషం. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఆయా పరిషత్‌లు నాటికల ప్రదర్శనలకు పోలీసుల నుంచి అనుమతిని సైతం పొందాయి. ఏప్రిల్ 7, 8, 9, 10 తేదీల్లో వరుసగా నాలుగు రోజుల పాటు 12 నాటిక ప్రదర్శనలు జరగనున్నాయి. ప్రతిరోజు నాటిక ప్రారంభ పూజా కార్యక్రమం మినహా గతంలో మాదిరిగా ప్రదర్శన మధ్యలో దాతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నిర్వహించే సభా కార్యక్రమం ఉండదని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8 నుంచి 11 గంటలకు ప్రతిరోజు మూడు నాటిక ప్రదర్శలు ఉంటాయన్నారు. ఇలా రెండు పరిషత్‌లు కలిసి రెండు గ్రామాల్లో రెండేసి రోజులు చొప్పున నాలుగు రోజుల పాటు కళావిందు చేయనున్నాయి. మొదటి రెండు రోజులు లింగారావుపాలెం గ్రామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలోనూ, తదుపరి రెండు రోజులు యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళావేదిక ప్రాంగణంలోనూ నాటిక ప్రదర్శనలు కొనసాగనున్నాయని ఆయా పరిషత్‌ల నిర్వాహణ విభాగం అధ్యక్ష కార్యదర్శులు కట్టా శ్రీహరి, ముత్తవరపు సురేష్‌బాబు, మండెపూడి శ్రీనివాసరావు, నూతలపాటి కాళిదాసు తెలిపారు. కార్యక్రమంలో తోకల సాంబశివరావు, ముత్తవరపు పద్మారావు, కట్టా వీరాంజనేయులు, జరుగుల శంకరరావు, మల్నేని సీతారామాంజనేయులు, నంబూరి వీరాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు ఉన్నారు.

ఊయలే.. ఉరితాడైంది !

ప్రమాదవశాత్తు విద్యార్థి మృతి

గురజాల : ఊయలే ఉరితాడై.. విద్యార్థి మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని దైదలో నివసిస్తున్న కొల్లిపాక శ్రీను, శివలక్ష్మి కుమారుడైన నారాయణ (13) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడులు కావడంతో ఉదయం పాఠశాలకు వెళ్లి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి సమీపంలో ఉన్న రావి చెట్టుకు స్నేహితులతో కలసి చీరలు తీసుకుని వెళ్లి ఊయల ఏర్పాటు చేసుకున్నారు. నారాయణ అందులో కూర్చుని తిరుగుతుండగా మెడకు ప్రమాదవశాత్తు చీర చుట్టుకుంది. ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు.

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.



పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధం గానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్టర్న్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

సంయుక్తారెడ్డి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

'నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది' అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరెట్ స్టూడెంట్ బిహార్‌లోని 'సమస్తిపూర్' పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరఫున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఎ. సోషియాలజీ చేసి ఇప్పుడు 'బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత' అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



శాంభవి చౌదరి

నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. 'మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు' అనే ప్రశ్నకు 'నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు' అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. 'ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం' అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు

ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.



ఉగాది పచ్చడి

కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ●చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. గమనిక: ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.



ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి

ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.

పాల గారెలు



కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.